చిన్నారుల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయం



చిన్నారుల తల్లులకు గిఫ్ట్‌ప్యాక్‌లు అందజేస్తున్న చైల్డ్ హెల్ప్ ఫౌండేషన్ ప్రతినిధులు

సైదాబాద్: చిన్నారులు సజావుగా నిద్రపోవాలని, వారి ఆరోగ్య పరిరక్షణే చైల్డ్ హెల్ప్ ఫౌండేషన్ ధ్యేయమని అని ఫౌండేషన్ మేనేజర్ నీలి ఫణీందర్ అన్నారు. శనివారం ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని సింగరేణి కాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో నవజాత శిశువుల నుంచి ఐదేళ్లలోపు చిన్నారుల తల్లులకు ప్రత్యేక వస్త్రాల గిఫ్ట్ ప్యాక్‌లను ఆయన అందజేశారు. గిఫ్ట్ ప్యాక్‌లోని వస్త్రాలను చిన్నారులకు ఎలా ఉపయోగించాలో సంస్థ ప్రతినిధులు డెమో నిర్వహించి మహిళలకు వివరించారు. చలికాలంలో చిన్నారులకు అనుకూలంగా ఉండేలా ప్రత్యేకంగా తయారు చేయించిన వస్త్రాలను చిన్నారుల తల్లులకు అందజేశారు. సింగరేణి కాలనీ అంగన్‌వాడీ కేంద్రం ఉపాధ్యాయురాలు అన్నపూర్ణ, జెస్సికా, వెంకటేష్, రూప, జ్యోతి, సుమాంజలి పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి


దేవకమ్మతోట కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ సుజాతానాయక్

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు తన శాయశక్తులా కృషి చేస్తానని హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాతా నాయక్ అన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని జిల్లా పరిషత్ రోడ్డు దేవకమ్మ తోట తదితర ప్రాంతాలలో స్థానికులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, డివిజన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. ప్రజల భాగస్వామ్యంతో పనులు త్వరితగతిన నాణ్యతతో పూర్తి అవుతాయని అన్నారు. కార్యక్రమంలో నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మమత, మల్లేశ్‌గౌడ్, రాంచందర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మెట్లబావుల పునరుద్ధరణ జరిగేనా?

- నాడు స్వచ్ఛమైన నీటితో కళకళ
- నేడు డ్రైనేజీ నీటితో దుర్గంధం
- సహారాస్టేట్స్ కాలనీలో శిథిలావస్థలో రెండు పురాతన బావులు
- అభివృద్ధి పట్టని అధికారులు



సహారాస్టేట్స్ కాలనీ బహార్ బ్లాక్ వద్ద శిథిలావస్థలో ఉన్న మెట్లబావి

మన్సూరాబాద్: పురాతన మెట్లబావులు నేడు మురుగు నీటితో కంపుకొడుతున్నాయి. వందల ఏళ్ల క్రితం రాయితో అందంగా నిర్మించిన ఈ వారసత్వ కట్టడాలను రక్షించడంలో ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం చేస్తున్నారు. మన్సూరాబాద్ డివిజన్ సహారా స్టేట్స్ కాలనీలో ఉన్న రెండు పురాతన మెట్ల బావుల దుస్థితే ఇందుకు నిదర్శనం.

◆ ప్రస్తుత సహారా కాలనీ ప్రాంతం అప్పట్లో దట్టమైన అటవీ ప్రాంతం కావడంతో నాటి పాలకులు పర్యాటకంతో పాటు వ్యవసాయానికి అనువుగా ఉండేలా మెట్లబావులను సుందరంగా నిర్మించారు. నేడు అవి శిథిలావస్థకు చేరుకున్నాయి. కాలనీలోని కమ్యూనిటీ హాల్ వద్ద ఒక మెట్లబావిపైనే లలితా నాగలింగేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మించారు. సహారా బహార్ 10 బ్లాక్ వద్ద మరొక అందమైన మెట్లబావి ఉంది. అది కూడా నేడు పాడుబడింది. నాడు స్వచ్ఛమైన తాగునీటితో కళకళలాడుతూ పర్యాటకులను విశేషంగా ఆకట్టుకున్న ఈ బావులు ప్రస్తుతం డ్రైనేజీ మురుగుతో దుర్వాసన వెదజల్లుతున్నాయి. ప్రజాప్రతినిధులు స్పందించి మెట్ల బావులను అభివృద్ధి చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

గతేడాది పరిశీలించారు...

గతేడాది 'సాక్షి'లో ప్రచురితమైన కథనంతో స్పందించిన ఓ కార్పొరేట్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు బృందం సహారా కాలనీలోని మెట్లబావులను పరిశీలించింది. బావుల పునరుద్ధరణకు చర్యలు చేపడతామని చెప్పారు. అయితే, ఏడాది గడుస్తున్నా.. చర్యలు మాత్రం శూన్యం.


సహారాస్టేట్స్ కాలనీలోని నాగలింగేశ్వర స్వామి ఆలయం వద్ద ఉన్న మెట్లబావి

అభివృద్ధి చేయాలి


నాటి రాజులు ఎంతో సుందరంగా నిర్మించిన మెట్లబావులు కాలక్రమంలో శిథిలావస్థకు చేరాయి. మా కాలనీలో రెండు మెట్ల బావులు ఉండటం అదృష్టంగా భావిస్తున్నాం. శిథిలావస్థలో ఉన్న వీటిని పర్యాటకులను ఆకర్షించేలా అభివృద్ధి చేయాలి.
గంగదాసు కృష్ణారెడ్డి, సహారాస్టేట్స్ కాలనీ ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి

రైతులకు వ్యాపారులు సహకరించాలి


ఇఫ్తాకర్ నజీబ్‌ను సన్మానిస్తున్న వ్యాపారులు

చాదర్‌ఘాట్: మలక్‌పేట వ్యవసాయ మార్కెట్‌కు వచ్చే రైతులకు గిట్టుబాటు ధర లభించేలా వ్యాపారులు సహకరించాలని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ పర్సన్ ఇన్‌చార్జ్ ఇఫ్తాకర్ నజీబ్ అన్నారు. శనివారం మార్కెట్ పాలకవర్గం రద్దయిన నేపథ్యంలో పర్సన్ ఇన్‌చార్జ్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వ్యాపారులు ఆయనను సన్మానించారు. అనంతరం ఇఫ్తాకర్ నజీబ్ మాట్లాడుతూ, మార్కెట్‌కు మిర్చీ వస్తున్నందువల్ల అధికారులు రైతులకు అందుబాటులో ఉండి గిట్టుబాటు ధర వచ్చేందుకు కృషి చేయాలన్నారు. మార్కెట్ ఎస్‌జీఎస్ దామోదర్, వ్యాపారుల సంఘం అధ్యక్షుడు చేగూరి వెంకటరమణ పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మనసుకు ప్రశాంతత


బాబా ఆలయాన్ని శుభ్రం చేస్తున్న కార్పొరేటర్ తదితరులు

మలక్‌పేట: అయోధ్య భవ్య రామమందిరంలో శ్రీరాముల వారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు శనివారం మూసారంబాగ్‌లో స్వచ్ఛతీర్థ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీ మధుసూదన్‌రెడ్డి, బీజేపీ నాయకులతో కలిసి డివిజన్‌లోని రామాలయం, సలీంనగర్‌లోని షిరిడీ సాయిబాబా ఆలయ పరిసరాలను శుభ్రం చేశారు. ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ భక్తి భావం కలిగి ఉండాలని అన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాలు పంచుకోవడం వల్ల మనసుకు ప్రశాంతత, సంతోషాన్ని ఇస్తుందన్నారు. బీజేపీ నాయకులు రమేష్‌రెడ్డి, దేవేందర్, సురేందర్, కొప్పుల దినేష్, ప్రవీణ్, వీరేష్, నవీన్, కిరణ్, మల్లేష్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలి: ఏసీపీ


వాహనదారులకు సూచనలిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణరాజు

చాదర్‌ఘాట్: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాల నుంచి కాపాడుకోవాలని సౌత్‌ఈస్ట్ జోన్ మలక్‌పేట ట్రాఫిక్ ఏసీపీ కె.సత్యనారాయణరాజు అన్నారు. తెలంగాణ చాంబర్ ఆఫ్ అగ్రిట్రేడర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం మలక్‌పేట గంజ్‌లో ఏర్పాటు చేసిన రోడ్డు భద్రతా వారోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడతూ, ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత గురించి తెలుసుకోవాలన్నారు. దేశంలో ప్రతి నిముషానికి ఒక రోడ్డు ప్రమాదం జరుగుతుండగా, ప్రమాదంలో ఐదు నిముషాలకు ఒకరు చనిపోతున్నారని తెలిపారు. అసోసియేషన్ అధ్యక్షుడు చేగూరి వెంకటరమణ, మలక్‌పేట ట్రాఫిక్ సీఐ చంద్రశేఖర్, ట్రాలీ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లేష్, వ్యాపారులు వంజరి వినోద్, దుగ్గు జగదీష్, మార్కెట్ ఎస్‌జీఎస్ దామోదర్ పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన అవసరం

నాగోలు: రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని నాగోల్ ఆర్టీఓ సురేష్ రెడ్డి సూచించారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా శనివారం నాగోలు ఆర్టీఏ కార్యాలయంలో పలువురు డ్రైవర్లతో సదస్సు నిర్వహించారు. 'రోడ్డు ప్రమాదాల నివారణలో నా వంతు బాధ్యత నేను నిర్వహిస్తా' అంటూ వారితో ప్రమాణం చేయించారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ రూల్స్‌ను పాటించాలని ఆర్టీఓ సురేష్‌రెడ్డి అన్నారు. నాగోలు ఎంవీఐలు, సిబ్బంది, పలువురు డ్రైవర్లు పాల్గొన్నారు.

మలక్‌పేట ఆర్టీఏ ఆఫీస్‌లో...

మలక్‌పేట: మూసారంబాగ్‌లోని ఈస్ట్‌జోన్ మలకపేట ఆర్టీఏ ఆఫీస్‌లో ఆర్టీఓ వెదిరె సుభాషచంద్రారెడ్డి ఆధ్వర్యంలో రోడ్డు భద్రతా మాసోత్సవాలు కొనసాగుతున్నాయి. శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంవీఐ రమేష్‌బాబు రోడ్డు భద్రతా నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పించారు.ఎంవీఐ అరుణ, ఏఓలు విజయ్, ప్రవీణ్, మధుకర్, సిబ్బంది పాల్గొన్నారు.


డ్రైవర్లతో ప్రమాణం చేయిస్తున్న నాగోల్ ఆర్టీఓ సురేష్ రెడ్డి

రైతుబజార్లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా లోకల్ 17, వంకాయ 23, బెండ 35, పచ్చిమిర్చి 45, కాకర 38, బీర 35, క్యాలీఫ్లవర్ 18, క్యాబేజీ 19, క్యారెట్ 25, దొండ 25, ఆలు 23, ఉల్లి 22, గోకర 40, దోస 23, సొర 07, పొట్ల 13, అరటి 11, చిక్కుడు 28, అర్వి 67, మునగ 75, చిలగడదుంప 55, బీట్‌రూట్ 15, కీర 18, ఫ్రెంచ్ బీన్స్ 40, కాప్సికమ్ 50.ఈ ధరలు ఆదివారం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సైదాబాద్: చెట్ల కొమ్మల తొలగింపు, వివిధ మరమ్మతు పనుల కారణంగా ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలోని దిగువ తెలిపిన ప్రాంతాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని అధికారులు తెలిపారు.

ఉదయం 9 నుంచి 11 గంటల వరకు...
మూసానగర్, కమల్‌నగర్, సర్దార్‌జీ బిల్డింగ్, గవర్నమెంట్ సిటీ మోడల్ స్కూల్, నయాగరా హోటల్ పరిసర ప్రాంతాలు

ఉ. 11 నుంచి మ. ఒంటి గంట వరకు...
ఉస్మాన్‌పురా, హనుమాన టెంపుల్, ఎంఎంహెచ్, ముర్తుజా మసీద్, డీసీ పటేల్ కాలనీ, ఎంఎంహెచ్ హాస్పిటల్, తిరుమల లేన్, డేబ్రేక్ బ్యాక్ సైడ్ పరిసర ప్రాంతాలు

మ. 2 నుంచి సా. 4 గంటల వరకు...
అక్బర్ టవర్, పూల్‌బాగ్, నల్గొండ క్రాస్ రోడ్స్, పెట్రోల్ పంప్ బ్యాక్‌సైడ్, కాలడేరా, ఫుట్‌బాల్ గ్రౌండ్ పరిసర ప్రాంతాలు

నేడు అంధుల కళాశాలలో ప్రత్యేక కార్యక్రమాలు

లింగోజిగూడ: లూయిస్ బ్రెయిలీ జయంతి ఉత్సవాల్లో భాగంగా అంధుల కోసం ప్రభుత్వం ఈనెల 31వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తోందని బ్లైండ్ మహిళా సంఘం అధ్యక్షురాలు శ్రీకన్య తెలిపారు. ఇందులో భాగంగా ఆదివారం లింగోజిగూడ డివిజన్ తపోవన్ కాలనీలోని మహిళల అంధుల కళాశాలలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆమె తెలిపారు. అంధులకు సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ పోటీలు నిర్వహిస్తామని ఆమె తెలిపారు.

తుఫాన్ వాహనం బీభత్సం

- ట్రాఫిక్ సిగ్నల్ వద్ద ఆగి ఉన్న 3 బైక్‌లు, కారును ఢీకొన్న వైనం
- ముగ్గురికి తీవ్ర గాయాలు


తుఫాన్ వాహనం ఢీకొనడంతో చెల్లాచెదురుగా పడిన ద్విచక్రవాహనాలు

నాగోలు: తుఫాన్ వాహనం బీభత్సం సృష్టించింది. ట్రాఫిక్ సిగ్నల్ వద్ద ఆగి ఉన్న ద్విచక్ర వాహనాలతో పాటు ఓ కారును వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం ఈ ఘటన జరిగింది. ఎల్‌బీనగర్ పోలీసుల కథనం ప్రకారం..హస్తినాపురం, ఊర్మిళానగర్‌కు చెందిన పోరెడ్డి సురేందర్‌రెడ్డి రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌పై ఉదయం 8 గంటలకు ఆఫీసుకు వెళ్తున్నాడు. హస్తినాపురం సంతోష్‌మాత ఆలయానికి వెళ్లే ట్రాఫిక్ సింగల్ వద్ద బైక్‌ను ఆపాడు. అదే సమయంలో మాల్ నుంచి దూసుకొచ్చిన తుఫాన్ వాహనం బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో సురేందర్‌రెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. ఇతని పక్కనే ఉన్న మరో రెండు బైకులను కూడా తుఫాన్ వాహనం ఢీకొనడంతో సంగిశెట్టి కుమార్, ఆంథోనీ అనే ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పక్కనే ఉన్న స్విఫ్ట్ కారును ఢీకొట్టడంతో కారు ధ్వంసమైంది. క్షతగాత్రులను స్థానికులు చికిత్స నిమిత్తం హాస్పిటల్‌కు తరలించారు. ప్రమాద ఘటనతో చౌరస్తాలో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. బాధితుల ఫిర్యాదు మేరకు ఎల్‌బీనగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

22న ప్రతి ఇంటి ముందు దీపాలు వెలిగించాలి


నాగోలులో దీపంతాలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్

నాగోలు: హిందువుల చిరకాల స్వప్నం భవ్య రామమందిరం ప్రారంభోత్సవం సందర్భంగా ఈ నెల 22న ప్రతి ఇంటి ముందు దీపాలు వెలిగించాలని నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణా సురేంద్రనాథ్ యాదవ్ సూచించారు. రామమందిరం ప్రారంభోత్సవం రోజున వెలిగించేందుకు కాలనీవాసులకు కార్పొరేటర్ తన కార్యాలయంలో దీపంతాలు పంపిణీ చేశారు.కాలనీవాసులు సిద్ధల ఐలయ్య, వస్పరి మల్లేష్ శివశంకర్, మహేందర్ రెడ్డి పాల్గొన్నారు.

తాను మరణిస్తూ ఐదుగురి జీవితాల్లో వెలుగులు


దుర్గయ్య (ఫైల్)

మన్సూరాబాద్: తాను మరణిస్తూ ఐదుగురి జీవితాల్లో వెలుగులు నింపాడు ఓ రైతు. జీవన్‌ధాన్ ప్రతినిధి తెలిపిన వివరాల ప్రకారం... నల్లగొండ జిల్లా శాలిగోపురం మండలం ఇటుకలపహాడ్‌కు చెందిన అల్లి దుర్గయ్య (50) రైతు. ఈ నెల 16న సాయంత్రం 4 గంటల ప్రాంతంలో ఇంటిలోని బాత్‌రూంలో ఆకస్మాత్తుగా పడిపోయాడు. కుటుంబసభ్యులు వెంటనే ఎల్‌బీనగర్‌లోని కామినేని ఆసుపత్రికి తీసుకొచ్చారు. నాలుగు రోజులు పాటు చికిత్స అందించినా స్పందించకపోవడంతో బ్రెయిన్ డెడ్ అయిందని వైద్యులు ఈ నెల 19న ఉదయం ప్రకటించారు. విషయం తెలుసుకున్న జీవన్‌ధాన్ ప్రతినిధులు దుర్గయ్య భార్య, అతని ఇద్దరు కుమారులకు అవయవదానంపై అవగాహన కల్పించారు. అవయవ దానానికి వారు అంగీకరించడంతో వైద్యులు దుర్గయ్య శరీరం నుంచి లివర్, రెండు కిడ్నీలు, కంటి కార్నియాను సేకరించారు.

ఓటరు నమోదుకు విశేష స్పందన


ఓటరు నమోదు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్న అధికారులు

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ నియోజకవర్గం పరిధిలోని అన్ని డివిజన్లలో గల బూత్‌లలో ఓటరు నమోదు, సవరణ, మార్పులపై శనివారం జీహెచ్‌ఎంసీ అధికారులు ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. ఆదివారం కూడా ఇది కొనసాగుతుందని అధికారులు పేర్కొంటున్నారు.18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమేదు చేసుకోవాలని, ఓటరు జాబితాలో సవరణ, చిరునామా మార్పుకు కూడా అవకాశం కలిపిస్తున్నామన్నారు. డ్రైవ్‌కు మంచి స్పందన లభిస్తోందని అధికారులు, సిబ్బంది తెలిపారు.

నేటి నుంచి శనీశ్వర పూజ

నాగోలు: కొత్తపేట మారుతీనగర్‌లోని ప్రసన్నాంజనేయ ఆలయంలో ఈ నెల 21 (నేటి) నుంచి ఫిబ్రవరి 10వ తేదీ వరకు అర్ధ మండల శనీశ్వర పూజ నిర్వహిస్తామని ఆలయ నిర్వాహకులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం నుంచి ఫిబ్రవరి 10వ తేదీ వరకు శనీశ్వరుడికి ప్రతిరోజూ ఉదయం 8 నుంచి 9 గంటల వరకు తైలాభిషేకం, తిలార్చన జరుగుతుందన్నారు. ఈ పూజ ద్వారా భక్తులు శని దోషాల నుంచి విముక్తి లభిస్తుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

మైనార్టీ పాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

చంచల్‌గూడ: సైదాబాద్ మండల పరిధిలోని కొత్తపేటలోని తెలంగాణ మైనార్టీ గురుకుల బాలుర పాఠశాల (సైదాబాద్ బాయ్స్-2)లో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎండీ ఆసిఫ్ శనివారం తెలిపారు. 5వ తరగతిలో 80 సీట్లు, 6,7, 8వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం వచ్చే నెల 6వ తేదీ వరకు దరఖాస్తు స్వీకరిస్తామన్నారు.

చాంద్రాయణగుట్ట బాలురు-1 పాఠశాలలో...

నాగోలు: హయత్‌నగర్ పరిధిలోని సామనగర్‌లోని తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాల చాంద్రాయణగుట్ట బాలురు- 1 పాఠశాలలో 5, 6,7, 8 తరగతుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు హైదరాబాద్ డీఎం డబ్ల్యూఓ ఇలియాస్, ఆర్ఎల్‌సీ-1 జానిమియా ప్రిన్సిపాల్ కేవై దాస్‌లు శనివారం తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఫిబ్రవరి 6వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

రామ మందిర ప్రారంభం దేశం గర్వించే విషయం


ఆలయాన్ని శుభ్రం చేస్తున్న సామ రంగారెడ్డి తదితరులు

లింగోజిగూడ: అయోధ్య భవ్యరామ మందిరం ప్రారంభం దేశం గర్వించాల్సిన విషయమని రంగారెడ్డి జిల్లా అర్బన్ బీజేపీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి అన్నారు. రామ మందిరం ప్రారంభం నేపథ్యంలో పార్టీ పిలుపు మేరకు నిర్వహిస్తున్న ఆలయాల పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా ఎల్‌బీనగర్‌లోని ప్రసన్నంజనేయ స్వామి ఆలయంలో పార్టీ నాయకులతో కలిసి ఆయన స్వచ్ఛ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఆలయంతో పాటు పరిసరాలను శుభ్రం చేశారు. బీజేపీ నాయకులు మల్కాజిగిరి నాగరాజు, కిరణ్‌కుమార్, కృష్ణగౌడ్, శ్రీనివాస్, గణేష్‌గౌడ్ భరత్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీలు పొంగకుండా చర్యలు చేపట్టండి

మన్సూరాబాద్: డ్రైనేజీలు పొంగి పొర్లకుండా చర్యలు తీసుకోవాలని నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణాసురేందర్‌యాదవ్ జలమండలి అధికారులను కోరారు. డివిజన్‌లోని వాంబే కాలనీలో శనివారం ఆమె జలమండలి అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ అరుణ మాట్లాడుతూ, హిందూ శ్మశానవాటిక వద్ద డ్రైనేజీ పొంగిపొర్లుతోందని, యుద్ధప్రాతిపదికన నివారణ చర్యలు చేపట్టాలన్నారు. కాలనీల్లో డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా శాశ్వత పరిష్కార చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ తెలిపారు. కార్పొరేటర్ వెంట పాతూరి శ్రీధర్‌గౌడ్, సిద్దాల ఐలయ్య, వస్పరి మల్లేష్, సునిల్, దేవేందర్, మనోజ్ పాల్గొన్నారు.

టన్నెలింగ్ పనులు పరిశీలించిన ఎమ్మెల్యే

చైతన్యపురి: గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలోని సరూర్‌నగర్ చెరువు కట్ట కింద జరుగుతున్న టన్నెలింగ్ పనులను ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గడ్డిఅన్నారం డివిజన్‌లో వరదనీటి ముంపు సమస్య తీర్చే ప్రయత్నంలో భాగంగా గతంలో రెండు గేట్లు ఏర్పాటు చేయడంతో పాటు మరో టన్నెల్ పనులు చేపట్టామన్నారు. ఇప్పటికే 95 శాతం పనులు పూర్తయ్యాయని, త్వరితగతిన పూర్తి చేసి వరద ముంపు సమస్య లేకుండా చేస్తామన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ పవన్, మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్‌కుమార్, రమేష్ ముదిరాజ్, రమణారెడ్డి, ప్రదీప్, విక్కీ, కాంట్రాక్టర్ రమేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ లైసెన్స్‌తో మందుల విక్రయం

- ఫార్మసీపై డీసీఏ అధికారుల దాడి
- రూ.10 లక్షల విలువైన ఔషధాల సీజ్
- అదుపులో నిర్వాహకుడు



డీసీఏ అధికారులు స్వాధీనం చేసుకున్న మందులతో ఫార్మసీ నిర్వాహకుడు

సైదాబాద్: నకిలీ డ్రగ్ లైసెన్స్‌తో నిర్వహిస్తున్న ఓ మెడికల్ షాపుపై డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) అధికారులు దాడి చేసి రూ. 10 లక్షల విలువైన వివిధ రకాల మందులను స్వాధీనం చేసుకున్నారు. తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ జనరల్ వీబీ కమలాసన్ రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్న వివరాల ప్రకారం... మలక్‌పేట టీవీ టవర్ సమీపంలో ఉన్న ఐశ్వర్య ఫెర్టిలిటీ సెంటర్‌లో ఐశ్వర్య ఫెర్టిలిటీ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో మెడికల్ షాపు నిర్వహిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న డీసీఏ అధికారులు శనివారం సదరు మెడికల్ షాపుపై దాడి చేశారు. అధికారుల తనిఖీ చేస్తున్న సమయంలో కూడా ఐశ్వర్య ఫెర్టిలిటీ సెంటర్ హెడ్ అడ్మినిస్ట్రేటర్ అనిల్ బోదాసు తమకు అనుమతులు ఉన్నాయంటూ లైసెన్స్ సర్టిఫికెట్‌ను అధికారులకు అందజేశాడు. డీసీఏ తెలంగాణ డ్రగ్ లైసెన్స్ డేటా బేస్‌లో పరిశీలించిన అధికారులు ఆ లైసెన్స్ నకిలీదిగా గుర్తించారు. నకిలీ లైసెన్స్‌తో పాటు అక్రమంగా పెద్ద మొత్తంలో మందులు నిల్వ చేసి విక్రయిస్తున్నట్టు గుర్తించారు. ఈ సందర్భంగా రూ.10 లక్షల విలువ చేసే 27 రకాల మందులను స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో డీసీఏ అసిస్టెంట్ డైరెక్టర్ డి.సరిత, డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్స్ జి.అనిల్, బి.గోవింద్‌సింగ్, బి.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

లైసెన్స్ లేకుంటే కఠిన చర్యలు...

తెలంగాణ డీసీఏ లైసెన్స్ లేకుండా ఎవరైనా మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ జనరల్ వీబీ కమలాసన్ రెడ్డి హెచ్చరించారు. ఫార్మసీలు, మెడికల్ షాపుల నిర్వాహకులు మందులు స్టాక్ పెట్టుకునేందుకు, అమ్మకాలు చేసేందుకు తెలంగాణ డీసీఏ విభాగం లైసెన్స్‌లు మంజూరు చేస్తుందని ఆయన తెలిపారు. లైసెన్స్ పొందిన షాపుల్లోనే మందులు కొనుగోలు చేయాలని ఆయన ప్రజలకు సూచించారు. షాపులకు డీసీఏ లైసెన్స్ ఉన్నది.. లేనిది ఆన్‌లైన్‌లో ఓడీఎల్ఎస్ థర్డ్‌పార్టీ అని టైప్ చేసి నిర్ధారించుకోవచ్చని ఆయన ప్రకటనలో తెలిపారు. లైసెన్స్ లేని మందుల షాపుల నిర్వాహకులకు డ్రగ్స్ అండ్ కాస్మటిక్ యాక్ట్ కింద ఐదేళ్ల వరకు జైలుశిక్ష విధిస్తారన్నారని ఆయన ఓ ప్రకటనలో తెలిపారు.

22న కొత్తపేటలో ప్రత్యేక పూజలు


పోస్టర్‌ను విడుదల చేస్తున్న యాశ్పాల్‌గౌడ్ తదితరులు

నాగోలు: అయోధ్య రామ మందిరంలో ప్రాణ ప్రతిష్ఠ నేపథ్యంలో ఈ నెల 22 న కొత్తపేటలో హనుమాన్ యువసేన ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని హనుమాన్ యువసేన అధ్యక్షుడు యశ్పాల్‌గౌడ్ తెలిపారు. శనివారం హనుమాన్ యువసేన ఆధ్వర్యంలో అయోధ్యలో బాల రాముని విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ పూజ కార్యక్రమాల పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. హనుమాన్ యువసేన నాయకులు దాసు గౌడ్, రాజేందర్, కుల్కర్ణి, భాస్కర్, కిరణ్, వినోద్, గౌరవ్, వెంకటేష్, అభిషేక్, అభినయ పాల్గొన్నారు.

యువతిని మోసం చేసిన యువకుడి అరెస్టు

చైతన్యపురి: ప్రేమ పేరుతో యువతిని మోసం చేసిన యువకుడిని సరూర్‌నగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం... యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన ఎడ్ల తరుణ్ అనే యువకుడు నాగోల్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. అదే ప్రాంతంలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్న దళిత యువతిని ప్రేమించాడు. లింగోజిగూడలో రూమ్ అద్దెకు తీసుకుని ఇద్దరూ సహజీవనం చేశారు. ఆ యువతి గర్భం దాల్చడంతో అబార్షన్ చేయించాడు. అనంతరం వివాహం చేసుకునేందుకు నిరాకరించి ముఖం చాటేశాడు. దీంతో బాధిత యువతి సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు తరుణ్‌ను అరెస్ట్ చేశారు.